# భగ్న జీవులు



శ్రీ కాళ్లకూరి నరసింహారావు

ఆ చిన్న పూరింట్లో దీపం మిలమిలలాడుతోంది. సీతాకాలం! రాత్రి సుమారు 7 గం॥లు దాటింది. రామం చిన్నపోయిన ముఖంతో, మెల్లిగా కాళ్లీడ్చుకుంటూ యింటికి చేరాడు. అతని కోసమే యెదురు చూస్తూన్న శ్యామల, అతడు రాగానే "ఎక్కడైనా, యేమైనా దొరికిందా" అని ఆత్రుతగా అడిగింది. ఈ మాట చెవిని పడగానే మండుతున్న గాయానికి కారం రాచినట్లయిందతనికి. ఆమె ప్రశ్నకి ఒక్క దీర్ఘ నిట్టూర్పుకంటే యేమీ సమాధానం యివ్వలేక పోయాడు. అతని మొహం చూడగానే శ్యామల అర్థం చేసుకుంది.

"అయ్యో! యివ్వాళ అప్పైనా యెక్కడైనా దొరక్క పోతుందా, తెస్తారు, అని గంపెడాసతో కూర్చున్నాను. పాపాయి పాలు లేక కక్కటిల్లి పోతున్నాడు. మీరు నిన్నటి నుండి పస్తు, నాకు మూడు రోజులునుండి ఆహారమే లేదు."

"శ్యామలా, నువ్వు మూడు రోజులనుండి పస్తుపడుకున్నావా?"

"ఉన్నది మీకు పెట్టి నేను మంచినీళ్లతో రోజు గడుపుతున్నాను"

"అయ్యో, శ్యామలా, నువ్వు యీ నిర్భాగ్యుణ్ణి పెళ్లి చేసుకోక పోయినా అదృష్టవంతురాలవయ్యేదానవేమో"

"ఆ మాటే మిమ్మలననవద్దని వందసార్లు చెప్పాను.

మీరు మాత్రమేమి చేస్తారు, B. A. ప్యాసయ్యారు. కష్టపడి ప్రతివాడి చుట్టూ వుద్యోగం కోసం తిర్గుగుతున్నారు. బదులడుగుదుమేమో అని స్నేహితులు కూడ మొగముచాటు చేయుచున్నారు. మనకర్మమిట్లుండ నొకరిననుకొనుట యేల......"

"ఏమి చేయను శ్యామలా, యీ సర్టిఫికట్టు తీసుకుని ప్రతి ఆఫీసుకీ తిరిగాను. ప్రతి ఆఫీసరు కాళ్లూ పట్టుకున్నాను. కాని యెక్కడకు వెళ్లినా యీ లంచలమారి రోజుల్లో మనమొహం చూసేవాడు లేడు. దక్షిణ పట్టు చెపితేనేగాని దర్శనం కూడా కాదు. పిల్లాడి పాలకి చేతులో కాని లేని మనం యీ పిశాచ హృదయాలని యెల్లా సంతృప్తి పరచ గలం? అంచేత ఎచ్చటకు వెళ్లినా 'No Vacancy' అనే బోర్డులే, 'కాళీ లేదు,' అనే మాటలే వినిపిస్తున్నాయి."

"మీరీవిధంగా కష్టపడుతుంటే నే చూడలేనండీ, పైన భగవంతుడున్నాడు. యీ పూరియిల్లు తాకట్టు పెట్టండి. ఆ రామిసెట్టి యేమైనా యిస్తాడేమో కనుక్కురండి"

ఈ విధమగు నిస్పృహతో కూడిన ఒక నిశ్చయానికి వచ్చి, నిరాశతో నీరసంతో, నిస్పృహతో, పస్తులో ఆ రాత్రి ఆదంపతులు నిద్రాదేవి ఒడిలో సోలిపోయారు. మరునాడు రెండు జాముల ప్రొద్దెక్కినది. ఆ పూరియింటికి మునుపే యేమైన లెణకాలున్నవేమోనని భయపడి రామిసెట్టి అప్పీయ నిరాకరించెను. ఏమి చేయుటకును తోచక రామము మోచేతికి తల ఆనుకొని ఆలోచించుచుండెను. ఇంతలో గుడ్డ వుయ్యాలలోని పిల్లడు యేడుపువిని, శ్యామల పిల్లవాని నెత్తుకుని రామంవద్దకు వచ్చెను. పిల్లవాడు బాగా చిక్కి నీరసంగా, సన్నగా, వున్నాడు. ప్రక్క యెముకలన్నీ సులభంగా లెక్కపెట్టవచ్చు. కళ్లు గుంటలడి ప్రాణాలు

కళ్లల్లోవున్నాయి. రామం పిల్లవాణ్ణి చూచి చాటుగుండా ఒకకన్నీటిచుక్క విడిచాడు.

శ్యామల పిల్లాడ్ని చూపిస్తూ "నా దగ్గరపాలు లేవు. పిల్లాడంతకంతకి నీరసపడి పోయాడు, చూడండి డబ్బాపాలైనా పోద్దామంటే మనలను భగవంతుడనుగ్రహించడైనా."

"శ్యామలా, యేంచెయ్యను. నిరుపయోగకరమైన B. A. పట్టాకోసం సుక్షేత్రమైన పిత్రార్జితం తగలెయ్యకపోతే యీ నాడు నా బిడ్డడికీ స్థితి కల్గించకపోయేవాడిని"

ఈలా మాట్లాడుతుండగనే శ్యామల చేతిలోని పిల్లాడు కండ్లు తేలవైచాడు. చైతన్య రహితుడైన పుత్రుణ్ణి చూడగానే కెవ్వునకేకపెట్టి యేడుస్తూ శ్యామల "చూడండి, పిల్లాడివళ్లు యెలా చల్లబడిపోయిందో. ఎక్కడికేనా వెళ్లి త్వరగా డాక్టరును తీసుకురారూ?"

ఆ మాటలు చెవినిపడగానే రామం వీధిలోకి ఒక్క పరుగుపెట్టి దగ్గరలోనేవున్న ఒక డాక్టరును తీస్కువచ్చాడు. గుండె నాడి చూచి డాక్టరు ముందుగా బలానికి ఒక యింజక్షనివ్వాలనీ 8 రూ అవుతుందనీ ఖచ్చితంగా చెప్పివెళ్ళిపోయాడు. శ్యామల రామారావునిచూచి ఆతృతగా స్నేహితులెవరినైనా అడిగి త్వరగా యింజక్షను కొనుక్కురారూ?" అంది. వెంటనే రామం ముఖ్యంగా అడగవలసిన అందరినీ యెంతో ఆశతో అడిగడు. ఇటువంటి పరిస్థితులలో పాపం ధనవంతులకి కళ్లుతప్ప చెవులు సమూలం వినిపించవు. ఒక్కరూ ఇతనిపరిస్థితి గ్రహించలేరు. గ్రహించవలసిన అవసరం వారికేం? వారింటిలో బిడ్డ కాదుగా? ఒకరు దగ్గరలేదనీ, పెదనోటుకు చిల్లరకాయితాలు లేవనీ, మరొకరు యిప్పుడే యెవరికో యివ్వాలని యిచ్చేశామనీ. యీ విధంగా అందరూ తప్పుకున్నారు. రామానికి గత్యంతరం ఏమీ తోచలా. తిన్నగా తిర్రితిర్రి బజారురోడ్డుకువచ్చాడు. మిట్టమధ్యాన్నం రెండుగంటలు దాటింది. అక్కడే యింపీరియలు బ్యాంకి వున్నది. ఆ బ్యాంకులో అప్పుడే చెక్కు మార్చుకుని వెడుతున్న యెలిమెంటరీ స్కూలు మేష్టారు వెడుతు కనిపించాడు. ఆయనకు వయసుమళ్లింది. అతనిచేతిలోని నోట్లు రామం కళ్లలో తళుక్కున మెరిశాయి. అతని మీదపడి పోదామా అనిపించింది. కాని వివేకం తలెత్తింది. ఇంతలోనే తన ముద్దుబిడ్డ పరిస్థితి జ్ఞాపకమొచ్చింది. శ్యామల మాటలు చెవులో గింగురుమన్నాయి. తోడనే రామం పిచ్చివాడైపోయాడు. ఉద్రేకంలో ప్రక్కనున్న బీటుపోలీసు సన్నా చూడకండా ఆ మేష్టరుమీదపడి, పీకనులిమి ఆ నోట్లులాక్కున్నాడు. తోడనే పోలీసు విజిల్సు మారుమ్రోగాయి. మరుక్షణంలో రామం నల్గురు పోలీసుల మధ్య బందీగానున్నాడు.

మరునాడు ....ముసలి మేష్టార్ని హత్యచేసినందుక్కు రామానికి వురిశిక్ష పడింది. ఈ మాట వినగానే, అసలే అంతక్రితమే పోయిన కుర్రాణ్ణి పక్కపెట్టుకుని యేడ్చి, యేడ్చి, నీరసంగా పడివున్న శ్యామల గుండె ఆగిపోయింది. పాపం ఆ భగ్నజీవులనుగూర్చి, మనకఠిన, కర్కశ, శిలా, హృదయాలుగల మానవ సంఘం, ఒక్క కన్నీటి చుక్కైనా రాల్చక పోవడమే కాకుండా, పైగా 'పాపఫలితం వూరికేపోతుందా? దుర్మార్గుడు. ఆ ముసలి మేష్టరు వుసురు పోసుకున్నాడు"! అనుకుంది.

"నన్నూ, నాకుటుంబాన్నీ, యీ అధమావస్థకి తెచ్చింది మీరుకారూ?" అని సంఘాన్ని ప్రశ్నిస్తున్నట్లుగా చూస్తూ, వేళ్లాడుతోంది రామం తలకాయ, ఆ వురికంబంమీద.